క్లుప్తంగా

అమ్మవారిశాలలో సామూహిక పూజలు



సామూహిక పూజలో పాల్గొన్న మహిళలు

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీ మాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం శ్రావణ మాస పౌర్ణమి పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మణిద్వీప వర్ణలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి చిత్ర పటం, కలశాన్ని కొలువుంచి వేద మంత్రాల మధ్యన సామూహిక కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు.

పౌర్ణమి పూజలు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలో ఆహ్లాదకర వాతావరణంలో వెలసిన పురాతన నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమిని పురష్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి రవి స్వామి ఆధ్వర్యంలో సాలగ్రామం రూపంలో ఉన్న స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.మల్లేశ్వరస్వామితో పాటు పార్వతి, వినాయకుడికి అభిషేకం తదితర పూజలు చేశారు. ఆలయ కమిటీ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పల్లకీ సేవలో భాగంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేశారు.

ముగిసిన జియారత్ వేడుకలు



పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న కాటసాని ఓబుళరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి జియారత్ వేడుకలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి నుంచి గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుళరెడ్డి పీర్లకు ఫాతెహాలు సమర్పించారు. అలాగే గ్రామంలోని ఆయా వీధుల్లో పీర్ల ఊరేగింపులో భక్తులు పీర్లస్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను చావిళ్లలో కొలువుంచడంతో జియారత్ వేడుకలు ముగిశాయి.

ముగిసిన మొహర్రం



పీర్లను నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో మొహర్రం వేడుకలు మంగళవారం ముగిశాయి. పీర్ల నిమజ్జనం సందర్భంగా సాయంత్రం ముజావర్లు పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు.మేళతాళాల మధ్య పీర్లను ఎత్తుకొని నిప్పుల గుండంలో భక్తి శ్రద్ధలతో దిగా రు. మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే ఈపండుగలో ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. విచిత్ర వేషధారణలు అలరించారు. పీర్లను ఊరేగింపుగా కుంట వద్దకు తీసుకెళ్లి శుద్ధి చేశారు.

పరామర్శ

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన మాజీ ఎమ్మెల్యే దివంగత కానాల అంకిరెడ్డి కుమారుడు కానాల రాంభూపాల్‌రెడ్డి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుళరెడ్డి మంగళవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులైన మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ కానాల కామేశ్వరమ్మ, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నాగార్జునరెడ్డి, తదితరులను పరామర్శించారు.

పింఛన్ పంపిణీ



వృద్ధురాలికి నగదు అందజే స్తున్న సాధిక్

బనగానపల్లెరూరల్: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక బుధవారం ఉదయం 5 గంటల నుంచి వలంటీర్ల పింఛన్ పంపిణీ ప్రారంభించారు. మండలంలో మొత్తం పింఛన్‌దారులు 12,354 ఉండగా రూ.3.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. 90 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. మిగిలిన మొత్తాన్ని రెండురోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

నిరసన ర్యాలీ

బేతంచెర్ల: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన హింసను ఖండిస్తూ మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. కొత్తబస్టాండు నుంచి పాత బస్టాండు వరకు విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ప్రదీప్, విజయ్, ఎల్ల క్రిష్ణ, దిలీప్, శ్రీకర్, నవీన్, చక్రి పాల్గొన్నారు.

దర్జీలకు చేతినిండా పని!

- విద్యాకానుక యూనిఫాంతో టైలర్లు బిజీబిజీ
- నియోజకవర్గంలో27,146 మంది విద్యార్థులు



దస్తులు కుడుతున్న టైలర్లు

బేతంచెర్ల : ఒకప్పుడు పండగొచ్చినా... శుభకార్యాలు జరిగినా కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల దగ్గరికే పరుగులు తీసేవారు. పండుగలు... శుభకార్యాలు ఒకేసారి వచ్చినప్పుడు దర్జీలు రేయింబవళ్లు కష్టపడాల్సిన పరిస్థితి. ఒక్కోసారి తాము సమయానికి ఇవ్వలేమని చేతులెత్తేసిన సందర్భాలు అప్పట్లో కోకొల్లలు. అయితే కాలక్రమేణా వచ్చిన మార్పుల నేపథ్యంలో రెడీమేడ్ దుస్తుల రాక దర్జీలపై తీవ్ర ప్రభావం చూపింది. టైలర్ల దగ్గర దుస్తులు కుట్టించుకు వ్యక్తుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. దీంతో టైలరింగ్ వృత్తిదారులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకపోయారు. కొత్తగా ఎవ్వరూ టైలరింగ్ చేపట్టే పరిస్థితీ లేదు. దర్జీల సమస్యలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్కొక్కరికీ ఏటా రూ. 10 వేలు అందిస్తూ ఆసరగా నిలుస్తున్న విషయం తెలిసిందే. అదేవిధంగా జగనన్న విద్యాకాను యూనిఫాం సైతం టైలర్లకు ఉపాధి కల్పిస్తుంది. ప్రభుత్వం కొత్తరంగులతో జగనన్న విద్యా కానుక యూనిఫాం తీసుకురావడంతో టైలర్లకు చేతినిండా పని దొరికింది. విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు టైలర్లను ఆశ్రయిస్తుండడంతో దర్జీలు బిజీబిజీ అయ్యారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రతి విద్యార్థికీ 2 జతల యూనిఫాం అందిస్తున్న నేపథ్యంలో టైలర్లకు చేతినిండా పని దొరుకుతుంది.

కుట్టుకూలి చెల్లిస్తున్న ప్రభుత్వం...

డోన్ నియోజకవర్గంలో సుమారు 700 మంది టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఈఏడాది నియోజకవర్గంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న 27,146 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు జతల చొప్పున్న యూనిఫాం అందజేసింది. యూనిఫాం కుట్టుకూలి నిమిత్తం రూ. 120 చొప్పున్న విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం నగదు జమచేస్తుందని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. దీంతో వేల సంఖ్యలో విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు టైలరింగ్ షాపులకు క్యూ కడుతున్నారు. గతంలో కరోనా సమయంలోను పనిలేకపోతే జగనన్న విద్యాకానుక యూనిఫాం లే ఆదుకున్నాయని టైలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	విద్యార్థుల సంఖ్య
డోన్	: 11724
బేతంచెర్ల	: 8472
ప్యాపిలి	: 6950

యూనిఫాంతో ఉపాధి



టైలర్లకు ఇప్పటికే ప్రభుత్వం ఏటా రూ. 10 వేల ఆర్థిక సాయం చేస్తోంది. దీంతో పాటు జగనన్న యూనిఫాం కుట్టు పనితో డోన్ నియోజకవర్గంలో టైలర్లకు లబ్ధి చేకూరుతుంది. పాఠశాల ప్రారంభం నుంచి యూనిఫాం కుట్టడంలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి పరోక్షంగా ఉపాధి లభించింది.

– హరి టైలర్, బేతంచెర్ల

ఆదుకుటుంటున్న విద్యాకానుక



విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యాకాను యూనిఫాం పరోక్షంగా టైలర్లను ఆదుకుంటుంది. రెడీమెడ్ దుస్తుల రాకతో మాకు పని పూర్తిగా తగ్గిపోయింది. నాలుగేళ్లుగా జగనన్న విద్యా కానుక యూనిఫాం మమ్మల్ని ఆదుకుంటుంది. ఉపాధి కల్పించిన ప్రభుత్వానికి కృజ్ఞతలు.

– మధు టైలర్

శ్రీ చౌడేశ్వరిదేవికి సహస్రదీపాలంకరణ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవికి సహస్రదీపాలంకరణ, ఊయల సేవా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

బాల గంగాధర్ తిలక్ వర్ధంతి

డోన్ టౌన్ : స్వాతంత్ర సమరయోధులు బాల గంగాధర్ తిలక్ వర్ధంతి పురష్కరించుకుని మంగళవారం కొత్తపేట హైస్కూల్లో ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా తిలక్ సేవలను హెచ్ఎం రామనర్సప్ప, సామాజిక కార్యకర్త మహమ్మద్‌రఫీ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోక్‌నాథ్‌రెడ్డి, మాణిక్యంశెట్టి, గంగిరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం సమీపంలో పేకాట స్థావరంపై మంగళవారం సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ.16,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు పట్టుబడినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మంత్రి లక్ష్యం



గోరుకల్లు వద్ద వాటర్‌గ్రిడ్ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



బుగ్గానిపల్లె వద్ద నీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులను పరిశీలస్తున్న దృశ్యం

- డోన్ నవనిర్మాణ యాత్ర పేరిట అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రజాప్రతినిధులు

ప్యాపిలి: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని, ఆ దిశగా అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నారని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు మండల పరిధిలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు దాదాపు 300 మంది వాహనాల్లో మంగళవారం డోన్ నవనిర్మాణయాత్ర పేరిట బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు ముందుగా పాణ్యం నియోజకవర్గంలోని గోరుకల్లు రిజర్వాయర్ వద్ద రూ. 300 కోట్లతో చేపడుతున్న వాటర్ గ్రిడ్ పనులను వారు స్వయంగా చూశారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లోని 138 గ్రామాలకు రిజర్వాయర్ నుంచి నీటిని పంపింగ్ చేసే విధానాన్ని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె వద్ద 8 ఎకరాల్లో ఏర్పాటు చేసిన శుద్ధిచేసే ప్లాంట్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి డోన్ పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన నగరవనాన్ని సందర్శించారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. నియోజకర్గంలో రూ. 360 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు. అనంతరం ప్రజాప్రతినిధుల బృందం డోన్ పట్టణంలో రూ. 100 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ప్యాపిలి మండలం వెంగళాంపల్లి చెరువు వద్ద టూరిజం శాఖ అధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. హుసేనాపురం వద్ద రూ. 16 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, షెప్పర్డ్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, అలేబాదు బాలయ్య, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గజేంద్ర, రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజా మురళి, చంద్రశేఖర్ రెడ్డి, జంగం చంద్రశేఖర్, సోమశేఖర్, దివాకర్ రెడ్డి, కృష్ణమూర్తి, ధనుంజయ శెట్టి, జయరామిరెడ్డి, రామకృష్ణ, భాస్కర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గండికోట రామాంజనేయులు, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూస్తుంటే గర్వంగా ఉంది: సర్పంచులు

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలోని 138 గ్రామాలకు శుద్ధజలం అందించేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.300 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టడం అభినందనీయం అని సర్పంచులు మహేశ్వర్ రెడ్డి, కరణం మోహన్, రంగస్వామి, దస్తగిరి తదితరులు పేర్కొన్నారు. శాశ్వతంగా నిలిచిపోయే పనులైన వాటర్ గ్రిడ్, వంద పడకల ఆసుపత్రి, రోడ్లు,గురుకుల పాఠశాల భవనాలు, వెటర్నరీ కళాశాల భవన నిర్మాణ పనులను చూస్తుంటే గర్వంగా ఉందన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్, పంటల బీమా, పంటనష్ట పరిహారం తదితర అంశాలపై మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. విత్తనం మొదలుకొని పంట ఉత్పత్తుల విక్రయాల వరకు అన్నదాతకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, ఎఫ్‌టీసీ ఏడీ మంజువాణి, ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ రామసుబ్బారెడ్డి, ఏఓ నిరంజన్, పశువైద్యాధికారి కృష్ణకుమార్ తదతరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీసీహెచ్ఓ జప్రుల్లా, ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఓ జప్రుల్లా సూచించారు. మంగళవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని డీసీహెచ్ఓ సందర్శించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డితో కలిసి చర్చించారు. ప్రస్తుతం ప్రసవాలు కూడా పెరిగాయని వైద్యురాలు సాగరిక తెలిపారు. ప్రస్తుతం సీజేరియన్ ఆపరేషన్లు నిర్వహించడానికి పరికరాలు, నవ జాత శిశువుల సంరక్షణ కేంద్రం, ఆపరేషన్ థియేటర్, బ్లడ్ స్టోరేజ్ సెంటర్, చిన్న పిల్లల వైద్యులను నియమించాలని, బెడ్లు లేవని ఆమె విన్నవించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, వంశీ కృష్ణ, చరణ్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డిపాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు

బనగానపల్లెరూరల్: ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా ఉంటే, ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు, అల్లర్లకు తావు ఉండదన్నారు. బూత్‌లెవల్ ఆఫీసర్ల ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందని, రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని, మృతి చెందినవారి పేర్లతో పాటు డబుల్ ఎంట్రీ ఉంటే వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో అవుకు, బనగానపల్లె, సంజామల తహసీల్దార్లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, జనసేన, బీఎస్పీ తదితర పార్టీలకు చెందిన ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

- బనగానపల్లె నియోజకవర్గంలో 48,953 ధ్రువీకరణ పత్రాలు అందజేత
- జిల్లాలో మండలం ప్రథమ స్థానం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సాంకేతిక సమస్యల మూలంగా ప్రభుత్వ పథకాలు అందని అర్హులను గుర్తించి న్యాయం చేసేందుకు, ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు స్వగ్రామాల్లోనే అందజేయడాన్ని ప్రతిఒక్కరూ హర్షిస్తున్నారన్నారు. 1నుంచి నెల రోజుల పాటు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా బనగానపల్లెలో పూర్తిస్థాయిలో విజయవంతం అయిందని, మొత్తం 48,953 ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేశామని గుర్తు చేశారు. పట్టణంలోని స్వగృహం మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడారు. అర్హుడైన ఏ ఒక్క పేద సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, వారంరోజుల పాటు వలంటీర్లతో పాటు సంబంధిత అధికారులు ఇంటింటికీ వెళ్లి గతంలో పొందలేని అర్హత కలిగిన సర్టిఫికెట్ల వివరాలు సేకరించారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 49,274 సర్టిఫికెట్లకు వివరాలు సేకరించగా 48,953 ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఇంకా అందజేయని 321 సర్టిఫికెట్లను కూడా పరిశీలించి పంపిణీ చేస్తామన్నారు. బనగానపల్లె మండలంలో 21,293 సర్టిఫికెట్లు పంపిణీ జరిగిందని, జిల్లాలో ప్రథమస్థానం రావడం జరిగిందన్నారు. అలాగే ఇల్లూరుకొత్తపేట సచివాలయం పరిధిలో 2099 సర్టిఫికెట్లు పంపిణీ చేసి జిల్లాలో సచివాయాల్లో మొదటి స్థానం రావడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో 82 క్యాంప్‌లు ఏర్పాటు ద్వారా 91,965 ఇళ్లను వలంటీర్ల కవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వలంటీర్‌ల సేవలు అభినందనీయం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని, కొందరు రాజకీయ నాయకులు దురుద్దేశంతో కించపరుస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న పాలన లో మొత్తం 32 సంక్షేమ పథకలను అర్హులైన ప్రతి ఒక్కరికీ కులాలు,మతాలు పార్టీలకు అతీతంగా పథకాలు లభిస్తున్నాయన్నారు. జలకళపథకం ద్వారా అర్హులైన రైతులకు బోర్లు వేయడం జరుగుతుందని, నీరుపడిన తరువాత విద్యుత్ మోటార్‌తో పాటు వ్యవసాయ కనెక్షన్ కూడ ఇస్తున్నామని గుర్తు చేసిన ఎమ్మెల్యే ఈ పథకం ద్వారా ప్రతి రైతు రూ.7–8లక్షలు లబ్ధిపొందుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, కోడూరు రామచంద్రారెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల కేంద్రం అవుకు సమీపంలో 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సుభాషిణి మంగళవారం తెలిపారు. ఉప్పలపాడు, కొండమనాయునిపల్లె రస్తాలో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి తన బైక్‌పై ప్లాస్టిక్ సంచితో ప్రయాణిస్తుండటం గమనించి తనిఖీ చేయగా నాటుసారా లభ్యమైందన్నారు. నిందితుడు బనావత్ రామ్ పుల్లయ్య నాయక్‌ను అదుపులోకి తీసుకొని, నాటుసారాను, బైక్‌ను సీజ్ చేసామని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆప్కాస్ రద్దు చేయాలి

డోన్ టౌన్ : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డోన్ మున్సిపల్ కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్, పట్టణ,మండల కార్యదర్శులు శివరాం, రామాంజనేయులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, ఉపాధ్యక్షుడు పెద్ద ఎల్లయ్య మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, పీఎఫ్, ఈ ఎస్ఐ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొవిందు, ఏసు, రామాంజి, ఆవులయ్య, చంద్ర, నాగరాజు, అంజనమ్మ, వెంకటలక్ష్మీ, మాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె

బేతంచెర్ల: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామానికి చెందిన మొత్కు పాటి సుబ్బారెడ్డి మట్టి మిద్దె మంగళవారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పిండి, వడ్ల మిషన్‌లు ధ్వంసం అయ్యాయని, పర్నిచర్ దెబ్బతింది. సుమారు రూ. 5లక్షల ఆస్తినష్టం జరిగిందని, అధికారులు ఆదుకోవాలని సుబ్బారెడ్డి విన్నవించారు.

5 వరకు కౌలుదారు పత్రాలు

బేతంచెర్ల: కౌలు రైతులు కౌలుదారు పత్రములు పొందడానికి ఆగస్టు 5వ తేదీ వరకు గడువు పొడగించినట్లు ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. కౌలు రైతులు రైతు భరోసా కేంద్రం, గ్రామ రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌలుదారు పత్రాల కోసం భూ యజమాని ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, కౌలుదారు ఆధార్ కార్డ్ అందజేయాలన్నారు. కౌలుదారు కార్డు వలన బ్యాంక్‌లో పంట రుణం, పంట నష్ట పరిహారం, పంటల బీమా, సున్నవడ్డీ, మద్దతు ధరకు పంటను కొనుగోలు తదితర ప్రయోజనాలు కౌలుదారుడు పొందవచ్చని తెలిపారు.

హోంగార్డు సేవాతత్వం!

బనగానపల్లెరూరల్: స్థానిక కొండపేటలోని సుంకులమ్మగుడి మలుపు దారిలోని గుంతను మంగళవారం హోంగార్డుగా విధులు నిర్వహించే రంగన్న పూడ్చివేసి సేవాతత్వాన్ని చాటుకున్నారు. మలుపు వద్ద గుంతపడడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులుపడేవారు. ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. స్థానిక పోలీసు అధికారుల సహకారంతో సిమెంట్, కంకర తెచ్చి గుంతను పూడ్చి వేశారు. తానే స్వయంగా తాపీ మేస్త్రీలా పని చేసి గుంతను పూడ్చివేయడంతో స్థానికులు ఆయను అభినందించారు.

రెండో విడత జల్‌జీవన్ నిధులు విడుదల

- మండలానికి రూ.13.90 కోట్లు
- మొదటి విడతలో రూ. 6 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం

కొలిమిగుండ్ల: ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. ఈ మేరకు జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి వేసి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరాకు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అధికారులు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కృషితో కొలిమిగుండ్ల మండలానికి జల్‌జీవన్ కింద రెండో విడతలో రూ.13.50 కోట్లకు పైగానే నిధులు మంజూరయ్యాయి. మొదట విడతలో దాదాపు రూ.6కోట్లతో కొండమీదపల్లె, మీర్జాపురం, చింతలాయిపల్లె, నాగిసెట్టిపల్లె, బిలాడిపత్రి, బిఉప్పలూరు, కమ్మవారిపల్లె గ్రామాల్లో ఓవర్ హెడ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పైపులైన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండో విడతలో వచ్చిన నిధులతో కోటపాడు, తిమ్మనాయినపేట, నాగిసెట్టిపల్లె, గొర్విమానుపల్లె, నందిపాడు, హనుమంతుగుండం, కోర్నపల్లె, బందార్లపల్లె, అబ్దులాపురం, పెద్దవెంతుర్ల, యర్రగుడి, తుమ్మలపెంట, ఉమ్మాయిపల్లె, బెలుం, పెట్నికోట, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె, బిలాడిపత్రి, కొండమీదపల్లె, కమ్మవారిపల్లె, మీర్జాపురం, బిఉప్పలూరు, మదనంతపురం, రాఘవరాజుపల్లె, చింతలాయిపల్లె, ఇటిక్యాల, కల్వటాల, నాయినపల్లె, ఎస్.చెన్నంపల్లె,బెలుం శింగవరం గ్రామాల్లో కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో పాటు చేయనున్నారు. అదేవిధంగా పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నారు. మండల ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం కానుంది. దీంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అధిక వడ్డీ పేరుతో మోసం

డోన్ టౌన్ : అధిక వడ్డీ ఆశ చూపి నమ్మకం కలిగించి తోటి మహిళల నుంచి దాదాపు రూ.50లక్షల వరకు అప్పులు చేసి ఉడాయించిన సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని వైయస్ నగర్‌లో నివాసం ఉండే ఓ మహిళ తనకు బెంగుళూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర నగరాల్లో వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికింది. వ్యాపారం కోసం డబ్బులు అవసరం ఉందని రూ.5 వడ్డీ చెల్లిస్తానని చెప్పి పలువురు మహిళల నుంచి అప్పులు తీసుకుని ఖాళీ ప్రాంసరీ నోట్లురాసి ఇచ్చింది. మొదట కొంత మందికి రూ.5వడ్డీ సక్రమంగా చెల్లించడంతో నమ్మకం కలిగిన మరికొందరు రూ. లక్షల్లో అప్పులు ఇచ్చారు. మోసానికి పాల్పడిన ఇంటిలో పని మనిషి కూడా దాదాపు రూ.3లక్షలు అప్పు ఇచ్చినట్లు తెలిసింది. ఇలా దాదాపు రూ.50 లక్షల వరకు అప్పులు చేసి వడ్డీ చెల్లించని ఆమె కొద్ది రోజులుగా కన్పించడం లేదు. దీంతో బాధితులు పట్టణ పోలీసులను ఆశ్రయించగా విచారణ చేపట్టినట్లు తెలిసింది. సదరు మహిళా బంధువులను స్టేషన్‌కు పిలిపించగా డబ్బులు చెల్లించేందుకు కొంత వ్యవధి కావాలని కోరినట్లు సమాచారం.

అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నాయకులు

డోన్ టౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం అని రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజ్‌కుమార్, సర్పంచ్ ఎల్లమ్మ, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ కామాక్షమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసులు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మధుభూపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీరాములు, మహేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, ఈఓఆర్డీ వర ప్రసాద్, ఏఓ అబ్దుల్ షఫీ, ఏఈలు నారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మోటార్‌కు పూజ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. పట్టణంలోని సంజీవనగర్ కాలనీల్లో రూ. 1.30 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన బోరు బావి నుంచి నీటి సరఫరాను తాగునీటి ట్యాంకులకు నగర పంచాయతీ కమిషనర్, చైర్మన్, ఎంపీపీ మంగళవారం పూజచేసి ప్రారంభించారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, నిరంజన్, ఆనంద్, రమేష్, నక్క శ్రీను, వేణుగోపాల్‌రెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.